

చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శనివారం ఆడుదాం ఆంధ్ర సన్నాహక ర్యాలీని జెండా వూపి ప్రారంభించిన ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఆముద, డిఆర్‌ఓ రాజశేఖర్‌లు


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## స్వర్ణరథంపై మలయప్పసాక్షాత్కారం



తిరుమల,డిసెంబర్23 ప్రభాతవార్తప్రతినిధి :

ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన శనివారం ఎంతో పవిత్రమైన ...దేవునికి ప్రీతికరమైన రోజు ఉదయం శ్రీదేవిభూదేవిసమేతుడైన మలయప్పస్వామి బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్దనుంచి బయలుదేరింది. శ్రీదేవిభూదేవిమలయప్పస్వామివారిని అర్చకులు విశేషాభరణాలతో అలంకరించారు. బంగారురథంమీద కొలువుదీరి ఊరేగిన మలయప్పను దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథోత్సవంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి , టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇవో లోకనాథం, అర్చకులు,మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.



# వైకుంఠాన్ని మరిపిస్తున్న కలియుగక్షేత్రం

-ఆనందంతో సామాన్యభక్తులు వైకుంఠద్వార దర్శనం





తిరుమల,డిసెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:

దేవలోకంలో వైకుంఠాన్ని తలపించేలా కలియుగక్షేత్రం తిరుమలను టిటిడి అధికారులు అద్భుతంగా ఫల,పుష్పఅలంకరణలు, విద్యుద్దీప కాంతులతో చక్కగా తీర్చిదిద్దారు. అన్నిటికంటే మించి తిరుమల ఆలయం సమీపంలో శ్రీరంగాన్ని తలపించేలా రంగనాధస్వామి ఆలయ సెట్టింగ్స్‌తో దర్శనం టోకెన్ లేని భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి మోక్షం పొందామని అనుభూతి కలుగుతోంది. ఆలయంలోపల, వెలుపల సువాసనల పుష్పాలతో బంగారువాకిలి, ఆనందనిలయం, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం,మహద్వారం ,గోపురం ప్రాంతాలను ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు. ఇక వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వేకువజామున 2గంటలకు మొదలైన ప్రోటోకాల్ ప్రముఖుల దర్శనాలు 5.15గంటల వరకు సాగాయి. ఆ తరువాత ముందుగా నిర్ధేశించిన సమయం కంటే 45నిమిషాలు ముందుగానే సామాన్యభక్తుల టైమ్‌స్లాట్ సర్వదర్శనం, ఆన్‌లైన్ టిక్కెట్లు కలిగిన భక్తులను ఆలయంలోనికి అనుమతించారు. సామాన్యభక్తులు వెంకన్న దర్శనంతో బాటు వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకుంటున్నారు. శనివారం రాత్రి వరకు 55వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. తిరుమలలో సామాన్యభక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చక్కటి ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు నిరంతరాయంగా టీ,పాలు, అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. తిరుమలగిరులు గోవిందనామంతో మారుమోగాయి. భక్తులకు సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం టిటిడి అధికారులు చేయిస్తున్నారు. రోజుకు 70వేలమంది భక్తులకు దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేసి టోకెన్లు జారీచేశారు. పదిరోజులకు 8లక్షల మంది భక్తులు వైకుంఠద్వారంలో వేంకటేశ్వరుని దర్శించుకునేలా ఏర్పాట్లు జరిగాయి.

## సకలం శుభం-వైకుంఠద్వార ప్రవేశం

### -గోవిందుని ఆలయంలో ప్రశాంతంగా మోక్ష మార్గం దర్శనం











తిరుమల,డిసెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంఠం తిరుమలక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మోక్షమార్గం వైకుంఠ ద్వారం వేదపండితుల వేదమంత్రోచ్చరణ, ప్రత్యేకపూజలతో శనివారం వేకువజామున తెరుచుకున్నాయి. శ్రీనివాసుడిఆలయంలో ఆనంద నిలయం సమీపాన ఉన్న ఈ మోక్షమార్గంలో ఉదయం 5.15గంటలకే సామాన్యభక్తులను అనుమతించడంతో ఆనందంతో పరవశులయ్యారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో ఏకాదశి ఘడియల్లో వైకుంఠద్వారం తెరిచి భక్తులకు ముక్తిని కల్పించడం పరిపాటి. ఈ ఏడాది కూడా పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో ముందుగా వైకుంఠ ఏకాదశి ఘడియలు శనివారం మొదలవడంతో ప్రణాళికాబద్ధంగా ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు, ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ టిక్కెట్లు జారీచేయడంతో రోజుకు 80వేలమంది భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. తొలుత శనివారం వేకువజామున 2గంటల నుండి ప్రోటోకాల్ ప్రముఖులకు హారతి లేని లఘు దర్శనం చేయించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ఎన్‌వి రమణ దంపతులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు , హైకోర్టు న్యాయమూర్తులు ,ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్రమంత్రులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి,ఆర్‌కెరోజాతో బాటు పలువురు మంత్రులు, ఎంపి మిథున్‌రెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ భరత్, మాజీ జెఈఓలు కెవెస్ శ్రీనివాసరాజు, పోలా భాస్కర్,తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత దంపతులు, టిడిపి,వైసిపి నాయకులు, అధికారులు, అనంతపురం రేంజి డిఐజి ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి తదితర అధికారులు, ప్రముఖులు వైకుంఠద్వారదర్శనం చేసుకున్నారు. వీరందరికీ స్వయంగా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ వర్గాలు చక్కటి సంతృప్తికర దర్శనం చేయించారు. టోకన్లు కలిగిన భక్తులు సమయానికి తిరుమలకు చేరుకుని దర్శనం చేసుకోవాలని కోరారు.

## శేషవాహనంపై స్వామి సింహవాహనంపై దేవేరి దర్శనం




శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రం దక్షిణ కైలాసంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి శనివారం రావటంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.వేకువ జాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం కావటంతో పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, తెలుగురాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో అతిధులు హాజరయ్యారు.అధికారులు అందించిన సమాచారం మేరకు 30వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేశారు.విద్యుత్ దీపాలతో కళ్ళు జిగేలు మనిపించే విధంగా తీర్చి దిద్దారు. బోయిలు స్వామి అమ్మవార్లను మోసుకుంటూ వాహనాల మండపం వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడ స్వామి వారిని బంగారు శేష వాహనంపై ప్రతిష్టించారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని బంగారు సింహవాహనంపై ప్రతిష్టించి గ్రామంలో ఊరేగించారు. ధర్మకర్తల మండలి చైర్మెన అంజూరు తారక శ్రీనివాసులు,ఆలయ ఇఓ కె.యస్ రామారావులు పూజలు జరిపి ప్రారంభించారు. బోర్డు సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, సుమతి, ప్రత్యేకాహ్వానితులు ఎంపి శ్రీదేవి,జూలుగంటి సుబ్బారావు,నరసింహారాజు,సుబ్బరాయులు,లక్ష్మిపతి రెడ్డి వెంటరాగా టెంపుల్ ఇన్స్పెక్టర్స్ సుదర్శనం నాయుడు, హరియాదవ్,రాజా,శేఖర్, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ వెంటరాగా గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎఎస్ఐ జనార్థన్‌నాయుడు, వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు.

## కాణిపాకంలో నేత్రపర్వంగా ఉత్తరద్వార దర్శనం

### -వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు -పోటెత్తిన భక్తజనం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు



వరదునికి పట్టు వస్త్రసాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు



కాణిపాకం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

ముక్తిని ప్రసాదించే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి పెరియదేవి సయిత శ్రీవరదరాజస్వామి ఆలయంలో శనివారం ఉత్తరద్వార దర్శనం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి మూలవిరాట్‌లకు వేకువజామున 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి ఉత్సవమూర్తులను పవిత్రమైన ఉత్తరద్వారం వైపు వుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఇదిలా వుండగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరదరాజస్వామివారి ఆలయాని న్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వార్లకు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయం నుండి పట్టువస్త్రాలను, పూజా సామాగ్రిని ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్ళి వరదరాజ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులకు సమర్పించారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

### -వికసిత్ భారత్ నోడల్ అధికారి అజిత్‌జైన్

తిరుపతి,డిసెంబర్ 23ప్రభాతవార్త:

కేంద్రప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలను అందుకోవాలని, ప్రతి ఇంటా ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ ఆశయమని వికసిత్ భారత్ నోడల్ అధికారి అజిత్‌జైన్, తిరుపతి నగరపాలక అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర శనివారం సాయంత్రం తిరుపతిలో మహతి ఆడిటోరియం ప్రాంతంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి రవి, బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు, పాటిబండ మురళి, డాక్టర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య

### నగలు చోరీ

పుత్తూరు, డిసెంబరు 23 ప్రభాతవార్త :

పుత్తూరులో ఒక మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన జరిగింది. సిఐ లక్ష్మినారాయణ తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. మునిసిపాలిటీలోని కల్యాణపురంలో ఒక ఇంట్లో మేడ మీద వాటాలో గోపి, శ్రీదేవి (49) దంపతులు అద్దెకు నివశిస్తున్నారు. వీరి కుమారుడు సాయి బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె వివాహమై చెన్నైలో నివశిస్తోంది. భర్త గోపి తిరుమలలో దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీదేవి ఇంట్లో ఒంటరిగా వుంటోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి చెన్నై నుంచి కుమార్తె తన తల్లి శ్రీదేవితో మాట్లాడేందుకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. రాత్రి అవుతున్నా ఫోన్ తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి యజమానికి సమాచారం ఇచ్చింది. ఇంటి యజమాని మేడ మీదకు వెళ్లి చూడగా ఇంట్లో నుంచి టివి శబ్దం వినిపిస్తోంది, కానీ ఇంటికి తాళాలు వేసి వుండడంతో అనుమానం వచ్చి పగులగొట్టారు. ఇంట్లో శ్రీదేవి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, కుర్చీలో కూలబడి వున్నట్టు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి మెడలో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బీరువాలో విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్టు బంధువులు తెలిపారు. మృతి చెందిన శ్రీదేవి తలపై బలమైన గాయం వుంది. ఆ మేరకు హాలులో మృతి చెందిన కుర్చీ దగ్గరలో రక్తపు మరకలు వున్నాయి. శ్రీదేవిని హత్య చేసి ఎవరికీ అనుమానం రాకుండా వుండేందుకు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్టు నమ్మించేందుకు ప్రయత్నించినట్టు అనిపిస్తోంది. ఉరేసుకోవడానికి వినియోగించిన చీర మెడ చుట్టూ వదులుగా వుండడం దీనికి నిదర్శనంగా కనిపిస్తోంది. అంతేకాకుండా మృతదేహం సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడకుండా, కుర్చీలో కూర్చుని వుండడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీదేవి ( ఫైల్‌ఫోటో)

## ఎన్నికల సన్నద్ధంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన కలెక్టర్, ఎస్పి

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త

సమగ్ర ప్రణాళికతో సాధారణ ఎన్నికల్లో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిదుల బృందం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ సారథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ - 2024 సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై నోవాటెల్ హోటల్ విజయవాడలో రెండు రోజుల పాటు సమావేశంలో రెండవ రోజు వివిధ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఎన్నికల సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డిలు వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ వ్యాస్, స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్‌తో పాటు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరేంధిర, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ. వెంకటేశ్వరరావు, స్టేట్ పోలీస్ నోడల్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మానసిక ఉల్లాసం కోసం క్రీడలు

పెనుమూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
దేహధారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని ఉగ్రాణంపల్లి సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఉగ్రాణంపల్లి పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర సన్నాహక ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు కంకణం కట్టుకొని అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జమున, కార్యదర్శి రజని, సచివాలయ సిబ్బంది గుణశేఖర్, ధనుష్, మురళీ, శివప్రసాద్, మమత, నాగేంద్రబాబు, దేవా, పిడి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆధ్రంపై ర్యాలీ



బంగారుపాళ్యం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై శనివారం బంగారుపాళ్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి తహసిల్దారు కార్యాలయం వరకు విద్యార్థులు, క్రీడాకారులు, అధికారులు ర్యాలీ చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వున్న యువతీ యువకులతో పాటు వయస్సు మీరిన వారు సైతం ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని అధికారులు చెప్పారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంఇఓలు నాగేశ్వరరావు, రమేష్‌లు, పలువురు వైకాపా నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ రెస్కో డైరెక్టర్ రామప్ప మృతి



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త
కుప్పం పట్టణం మునస్వామిపురంకు చెందిన సీనియర్ నేత, మాజీ రెస్కో ఛైర్మన్ రామప్ప శనివారం మృతి చెందారు. ఈయన గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈయన అంత్యక్రియలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. రామప్ప మృతి పట్ల పలువురు నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## యువతలో క్రీడలను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త
యువతలో క్రీడలను ప్రోత్సహించేందుకే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆ ంధ్ర కార్యక్రమం చేపడుతున్నారని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాలికల హైస్కూల్ విద్యార్థినులు చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ర్యాలీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 15 ఏళ్ల పూర్తయిన ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆ ంధ్రలో పాల్గొనే అవకాశం కల్పించారన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, కౌన్సిలర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చంద్రబాబు హయాంలోనే మైనార్టీల అభివృద్ధి

- తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త
మాజీ సిఎం చంద్రబాబునాయుడు హయాంలోనే మైనార్టీల అభివృద్ధి జరిగిందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ అధ్వర్యంలో మైనార్టీల సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే వైకాపాకు మైనార్టీలు గుర్తుకు వస్తారన్నారు. షాదీతోఫా కానుకలో నిబంధనలు పెట్టి ముస్లింలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మైనార్టీ నేతలు సర్దార్, అన్సర్, హిదయతుల్లా, రఫీ, గని, మునాఫ్, నబీఉల్లా, సలాం, చాంద్, సుభాన్, అల్లాబకష్, ఆదిల్, షరీఫ్ పాల్గొన్నారు.

## కనమపచ్చార్లపల్లిలో బాబుష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ

**కుప్పంరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లిలో శనివారం తెదేపా నేతలు బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ మరలా చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. అధికారంలో రాగానే సూపర్ సిక్స్ పథకాలు, మహిళలకు మహాశక్తి పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామాలు బాగుపడాలంటే బాబు మరలా సిఎం కావాలని ప్రజలు ఆశీర వ్వదించాలని కోరారు.కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేంద్ర, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, బూత్ ఇన్‌చార్జ్‌లు కనకరాజ్, బీరప్ప, నాగరాజు, వెంకటేష్, రత్నప్ప పాల్గొన్నారు.

## కలసికట్టుగా అభివృద్ధికి కంకణం



ఎస్ఆర్‌పురం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
మండలంను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళడానికి కలసికట్టుగా కంకణం కట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు విధులు నిర్వర్తించాలని ఎంపిపి సరిత పిలుపునిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎంపిపి సరిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ చిత్తూరు-పుత్తూరు రహదారిలో కొత్తపల్లిమిట్ట వద్ద రహదారి అధ్వాన్నంగా వుందని ధ్వజమెత్తారు. ఇక్కడ మురికికాలువ లేకపోవడంతో రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తూ పరిసరాలను కలుషితం చేయడంతో పాటు ఓ రకమైన దుర్వాసన వస్తోందన్నారు. అలాగే కొత్తపల్లి, వివిపురం, కటికపల్లి పంచాయతీల్లో ద్వాక్రా మహిళల రుణాల మంజూరులో వెలుగు సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. రుణం మంజూరు అయిన మహిళ నుండి సిబ్బంది పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని మహిళలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.అలాగే మామిడి పంటలకు మందులను వ్యక్తిగతంగా ఇవ్వాలని ఆర్‌బిలకు అప్పగించి ఇస్తే కొంతమంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం వుంటుందని ఎస్ఆర్‌పురం సర్పంచ్ దిలీప్ అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కృష్ణయ్య, తహసిల్దారు బెన్ను రాజ్, సర్పంచ్‌లుహరిత, కుప్పయ్య, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, అధికారులు, కో-అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## సైనిక పతాక నిధికి విరాళం ఇస్తే ఆదాయపన్ను రాయితీ

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.విజయశంకర్‌రెడ్డి

**చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** మాజీ సైనికులు వారి కుటుంబసభ్యుల సహాయార్థం ఎవరైనా సాయుధ దళాల పతాక నిధికి ఇచ్చిన విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు వుంటుందని జిల్లా మాజీ సైనిక సంక్షేమ అధికారి ఆర్.విజయసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విరాళాలను నేరుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గిరింపేట అకౌంట్ నెం.62125384416లో జమ చేయవచ్చునని, లేదా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో చెల్లించి రసీదు పొందచ్చునన్నారు. వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఫోన్: 86888 17824, 73824 07242 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులు సత్వరం రెగ్యులైజ్

- బిజిపి నేత చిట్టిబాబు డిమాండ్



**చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని సత్వరం రెగ్యులైజ్ చేయాలని బిజెపి నాయకుడు చిట్టిబాబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట గత మూడు రోజులుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను శనివారం బిజెపి నేత చిట్టిబాబు కలిసి మద్దతు తెలిపి దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎ కాలం నుండి కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఐటి టీచర్లు పని చేస్తున్నారన్నారు. వీరందరిని ప్రభుత్వం ఇప్పటికి రెగ్యులైజ్ చేయలేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యంయాదవ్, బ్రహ్మానందరెడ్డి, పాండియన్, నరేష్‌కుమార్‌చౌదరి, మునిరత్నం, శ్రీనివాసులు, బిల్వనాధం, దేవరాజు, లావణ్య, ప్రకాష్, గీత, నందీశ్వరీ, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్రికెట్ టోర్నమెంట్

చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
బంగారుపాళ్యం రోడ్డులో అమర్‌రాజా ఫ్యాక్టరీ ఎదురుగా వున్న మైదానంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ న్విహిస్తున్నట్లు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ తెలిపారు. జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ ఆధ్వర్యంలో జరిగే ఈ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, డిఎ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, తెలుగుదేశం, జనసేన నాయకులు హాజరు అవుతారని ఆయన తెలిపారు.

## మున్సిపాల్టీలో కారుణ్య నియామకాలు

చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను శనివారం మేయర్ ఆముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణలు మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. నగర పురపాలక సంస్థ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఆరు మంది ఉద్యోగులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు వారి విద్యార్హతలను ప్రమాణికంగా తీసుకొని అందుబాటులో వున్న పోస్టుల మేరకు నియామకాలు చేపట్టినట్లు కమీషనర్ డాక్టర్ జె.అరుణ వివరించారు. ఈ మేరకు మేయర్ ఆముద నుండి జి.జయంతి(పిడబ్ల్యు మేస్త్రీ), బి.హేమవతి(పిహెచ్‌వర్కర్), వి.నిరంజన్‌కుమార్(పిహెచ్‌మేస్త్రీ), బిఆర్ నీలవేణి(గ్యాంగ్ మజ్దూర్), ఎం.హరిప్రియ(క్లినర్‌కంవాచ్‌మెన్), ఎం.హేమంత్‌కుమార్(అటెండర్) పోస్టుల్లో నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్‌రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు నూతన వస్త్రాలు పంపిణీ



చిత్తూరురూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:
నగరపాలక సంస్థ మెప్మా సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న గిరింపేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు నూతన వస్త్రాలు, చీరలు, లుంగీలను సపోర్టు సంస్థ అధ్యక్షుడు జోసఫ్‌రాజు పంపిణీ చేసారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఈఎంసి ఫౌండేషన్ ప్రతినిధి ఎడ్వర్ట్ సహకారంతో గత నాలుగు సంవత్సరాలుగా నిరాశ్రయులకు దుప్పట్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేయడం, నిరాశ్రయులతో కలసి ముందస్తు క్రిస్మస్‌సంబరాలు జరుపుకోవడం చాలా ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ మేనేజరు ప్రమీళ, కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, కేర్ టేకర్ ప్రసన్న, ఇంద్రాణి నిరాశ్రయులు పాల్గొన్నారు.

## పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలి



చిత్తూరురూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:
పట్టణంలోని గాంధీ విగ్రహం కూడలి నందు పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. పాదయాత్ర సమయంలో ఉచిత కరెంట్ ఇస్తామని హామి ఇచ్చి, అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్లలో 8సార్లు మూడు రెట్లు విద్యుత్ ఛార్జీలను పెంచి నడ్డి విరిచారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గస భ్యులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, జిల్లాప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఓబిసి మోర్చా జిల్లాఉపాధ్యక్షులు దొరబాబు, సెంట్రల్ మండల అధ్యక్షులు షణ్ముగం, గిరింపేట మండల అధ్యక్షులు సురేష్, జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రపై అవగాహన ర్యాలీ



చౌడేపల్లి, డిసెంబర్ 23 ప్రభాతవార్త
ఆడుదాం ఆంధ్ర ఇది అందరి ఆటపై అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీతోపాటు బస్టాండులో మానవహారం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర ఈనెల 26నుంచి సచివాలయాల స్థాయి నుంచి జరుగుతాయని అధికారులు వివరించారు. ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పక్కాగా ఆడుదాం ఆంధ్ర



పాలసముద్రం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
మండల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వాలంటీర్లకు పిలుపునిచ్చారు. ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణపై శనివారం వెంగళరాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో నాలుగు పాఠశాలల పిడిలతో సమావేశం నిర్వహించారు.ఎంఇఓలు గిరిజ, రాజేంద్రప్రసాద్, ఇఓఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, పిడిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణింపు



గుడిపాల, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణించి ఆరోగ్యంను సంరక్షించుకోవాలని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుడిపాలలో శనివారం ఆడుదాం ఆంధ్ర సన్నాహక ర్యాలీని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిఎస్ఆర్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. ఈ సదర్భంగా ఎంపిపి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇందులో భాగంగానే యువతీ యువకుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మధు, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంఇఓ-2 గణపతి, జెఎసి కన్వీనర్ సాయి, హెచ్ఎం ప్రసాద్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## క్రీస్తు సేవలోనే సంతోషం ఉంది

-జిల్లా గ్రంధాలయ ఛైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరిరూరల్, డిశంబర్ 23 ప్రభాతవార్త:
పట్టణంలోని స్థానిక చింతగుంట రోడ్‌లోని మార్గంలోని సీయోన్‌గాస్పెల్ మిన్ట్రీస్ చర్చిలో శనివారం క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రందాలయ ఛైర్ పర్సన్ దొంతు శారద, వెంకటగిరి సిఐ సంగమేశ్వరరావు హజరయ్యారు. అనంతరం కెక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లడుతూ క్రీస్తు సేవలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. అదేవిదంగా పేదలకు సేవ చేయడములోనే ఎంతో సంతోషం ఉందన్నారు.వెంకటగిరిలో అన్ని చర్చిలల్లో క్రిస్ మస్ సందర్బంగా కేకులతోపాటు పేదలకు చీరలు పంపిణి చేయడం జరిగిందన్నారు. అనంతరం దొంతు శారద సీయోన్ గాస్పెల్ మినీస్టీ చర్చి 50 మంది వృద్దులకు చీరలను పంపిణి చేయించారు. చర్చిలో పేదలకు అన్నదాన కార్యమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సంగమేశ్వరావు ,క్రైస్తువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



కోట, డిసెంబర్ 23 ప్రభాతవార్త
కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఓ భవాని, ఎంఇఓ మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి రోజూ మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఖచ్చితంగా విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని కోరారు. అదేవిధంగా త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని కోరారు. పేద విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబులను చక్కగా వినియోగించుకోవాలని కోరారు. చిన్నతనం నుంచి కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

## నవోదయ స్కూలులో ప్రీ క్రిస్మస్ వేడుకలు

నాయుడుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం స్కూలు ప్రాంగణంలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పద్మనాభరెడ్డి, పాఠశాల డైరెక్టర్లు దిలీప్‌కుమార్‌రెడ్డి, మోనికా తదితరులు పాఠశాల పిల్లలకు, ఉపాధ్యాయులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించిన కీర్తనలు, ప్రార్థనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు బ్లేసి, మాధవి, కవిత, అమీరమ్మ, వరలక్ష్మి, రమణయ్య, రవి, మదన్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గోకులకృష్ణ విద్యార్థులు

సూళ్లూరుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీగోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన రీజనల్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, షాట్‌పుట్, వాలీబాల్, షటిల్ తదితర పోటీల్లో గెలుపొందారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం జి.బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ఎం.సురేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జి.శశికళ, పీడీ కెఎస్‌డి ప్రసాద్, జి.అశోక్, ఏఓ గుర్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త



క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా చేకూరుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారంచుట్టిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పారు. శనివారం ఆయన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించే ముఖ్య ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఇంటికి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. సచివాలయ స్థాయిలో జరిగే పోటీలలో గెలుపొందిన వారిని మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య టెన్నికాయిట్, పరుగుపందేలను ప్రారంభించి కొద్దిసేపు క్రీడాకారులతో ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ, అయితా శ్రీధర్, జెట్టి వేణు యాదవ్, తహశీల్దార్ కె.రవికుమార్, ఎంపిడిఓ మురళి, ఎంఇఓ కాపులూరు శ్రీనివాసులురెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, చిలకా యుగంధర్, అల్లూరు రమేష్‌రెడ్డి, మల్లిరెడ్డి, పముజుల విజయలక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన మహోత్సవాలు

వాకాడు, డిసెంబర్ 23, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామం లోని శనివారం శ్రీ పట్టాభిరామాలయంలో ధనుర్మాసంలో అత్యంత పరమ పవిత్రమైన, విష్ణుమూర్తికి పరమ ప్రతీతికరమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహిం చారు.ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతా చార్యులు మాట్లాడుతూ విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్ర మైన వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనంలో దర్శించుకున్న, ఉత్తరాభి ముఖంగా ఉన్న శ్రీ వారి దర్శనం చేసుకున్న స్వామి వారి పరిపూర్ణ అనుగ్రహంలభిస్తుందనిఅన్నారు. ఈ సందర్భంగా హనుమత్, లక్ష్మణ, సీతా సమేత శ్రీ రామచంద్రస్వామి వారికి విశేష అలంకరణలు చేసి ఉత్తరాభిముఖంగా స్వామి వారి దర్శనం ఏర్పాట్లును చేసారు.

## శ్రీకళ్యాణ రామాలయంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి

కోట,డిసెంబర్ 23 ప్రభాతవార్త



కోట మండలం సిద్దవరం గ్రామంలో శ్రీకళ్యాణ రామాలయంలో ధనుర్మాసా ఉత్సవల్లో భాగంగా ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఉత్తర ద్వారం ద్వార స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవ మూర్తలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం భక్తలకు తేనీరు,పాలు, పండ్లు, అందించారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు దూవ్వూరు ద్రవకుమార్ రెడ్డి,జాహ్నవిలు ఉభయ కర్తలగా వ్యహరించారు. ఆలయంకు వచ్చిన భక్తలకు సౌకర్యాలను . ఆలయ ధర్మ కర్త దూవ్వూరు ద్రవకుమార్ రెడ్డి అన్నీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పరమహంసయోగానందలో పండగల వేడుకలు

శాంతిపురం, డిసెంబర్ 23 ప్రభాతవార్త
స్థానిక పరమహంస యోగానంద గురుకుల పాఠశాలలో వైకుంఠ ఏకాదశి, క్రిస్మస్ పండగ, జాతీయ రైతు దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతు దినోత్సవం ప్రాధాన్యత, క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి పండగల గొప్పతనాన్ని వివరించేలా ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు సుధాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, నాగమణి, నళిని, సంపత్, మనోశ్రీ, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సీఐ



గూడూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త
పోలీస్.. అంటేనే కొంతమంది అదోవిధంగా భావిస్తారు. కానీ శాంతిభద్రతల పర్యవేక్షణే కాదు. పరిమళించే మానవత్వం కూడా మాలో ఉందని నిరూపించారు గూడూరు టూ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు. తిరుపతి జిల్లా గూడూరులోని అరవింద్ హాస్పిటల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయం అందరికీ తెలిసిందే కానీ ఆ సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహన చోదకులు, అక్కడ ఉన్న ప్రజలు మృతదేహాన్ని చూస్తున్నారు.. వెళ్లిపోతున్నారు తప్ప అటుపక్క చూసిన, పక్కన పెట్టిన పాపాన పోలేదు. ఇది తెలుసుకున్న రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఆ మృతదేహాన్ని పక్కన పెట్టేందుకు పలువురిని పిలవగా ఏ ఒక్కరూ స్పందించలేదు. ఇక స్వయంగా ఆయనే రంగంలోకి దిగి ఆ మృతదేహాన్ని చేతులతో ఎత్తుకొని మానవత్వం చాటుకున్నారు. పోలీసులలో మానవత్వం ఉండదని అనుకుంటుంటారు. కానీ రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావుని చూస్తే మానవత్వానికి నిలువెత్తు రూపమని అనిపిస్తుంది. ప్రజలు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కి అవసరాల నిమిత్తం వెళితే వారిని మర్యాదపూర్వకంగా కూర్చోబెట్టి వాళ్ల కష్టాలను తెలుసుకొని అవసరాలు తీర్చి పంపిస్తారని అక్కడ ప్రజలు తెలియజేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలెన్నో చేస్తూ నేడు ఆయన మానవత్వాన్ని చాటుకుంటున్నారని ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

## సూళ్లూరుపేటలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి దేవస్థానం, శ్రీ బాలాంజనేయస్వామి దేవస్థానం, శ్రీరామమందిరం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానాలలో భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున దేవాలయాలకు తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. మన్నారుపోలూరులోని అలఘుమల్లారి స్వామి దేవస్థానంలో టిటిడి వారిచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి దేవస్థానం నుంచి స్వామివారిని పల్లకిలో అలంకరింప చేసి గోవింద నామ స్మరణలు, భోజనలతో గ్రామోత్సవాలు అత్యంత వైభవంగా జరిపారు.

## రోడ్డెక్కినా మాపై జాలి లేదా.. జగనన్నా ?

కోట,డిసెంబర్ 23 ప్రభాతవార్త
మా కష్టాలు కనిపించడం లేదా.. మా ఆకలి కేకలు వినిపించడం లేదా అంటూ రోడ్డెక్కినా మా పై కనికరం లేదా జగనన్నా అని అంగన్‌వాడీ కార్యకర్తలు ,సహయకులు అంటున్నారు. కోట సీడీపివో కార్యాలయాలం ఎదుట గత 12 రోజులగా నిరవధికంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లా యూనిమున్ అధ్యక్షరాలు, ప్రమీల, నాయకరాలు వై.రమణమ్మ అన్నారు.శనివారం కార్యాలయాం వద్ద శ్రమదానం చేశారు. చెత్తను తొలగించి పరిశ్రభమైన వాతావరణం ఉండేలా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సర్కారులో తమ బతుకు భారమైందని పనికి తగ్గ వేతనం ,తమకు న్యాయంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కుల్ని అడగం తప్పా అని వారు ప్రశ్నించారు. గౌరవ వతేనం వద్దు రద్దు చేసి కనీస వేతనం చెల్లించాలని అంగన్‌ఆడీల ఎనిదాదాలతో హోరెత్తించారు. నెలకూ 26 వేల కనీస వేతనంగా ఇవ్వాలని వారు డిమాండు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలంటే ప్రభుత్వానికి చిన్న చూపుని,రాబోయే ఎన్నికల్లో తమ శక్తి చూపి బుద్ది చెబుతామని పేర్కొన్నారు.ఈ నిరశనలో కోట,వాకాడు, చిట్టమూరు మండలాల్లో అంగన్‌వాడీ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ఫైలేరియా కట్టడికి నైట్ బ్లడ్ సర్వే

పాలసముద్రం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:
క్షేత్ర స్థాయిలో ఫైలేరియాను పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నైట్ బ్లడ్ సర్వేను చేపట్టింది. ఈ మేరకు పిహెచ్‌సి డాక్టర్ మోహన్‌కృష్ణ శుక్రవారం రాత్రి బలిజకండ్రిగ, పాలసముద్రం గ్రామాల్లో నైట్ బ్లడ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ గతంలో బలిజకండ్రిగ, పాలసముద్రం గ్రామాల్లో ఫైలేరియా వ్యాధిగ్రస్తులు వుండటంతో ఈ గ్రామాల్లో వ్యాధిగ్రస్తులు పూర్తి స్థాయిలో వుండకూడదని జిల్లా అధికారులు ఇక్కడ నైట్ సర్వే నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని, ఫైలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ర్యాండమ్‌గా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జ్ఞానశేఖర్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీ సీనియర్‌నాయకుడు మృతి తీరని లోటు



**తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త** మండలంలోని పిల్లమేడు గ్రామ పంచాయతీ హరిజనవాడకు చెందిన విద్యావేత్త సింగమాల అంకయ్య గత నాలుగు రోజులుగా డెంగ్యూ జ్వరంతో భాదపడుతూ తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకయ్యను శుక్రవారం రాత్రి రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడులు ఆస్పత్రిలో పరామర్శించి త్వరగా కోలుకోవాలని మనోధైర్యాన్ని కల్పించారు. అయితే శనివారం ఉదయం ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అంకయ్యకు గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు పిల్లమేడు గ్రామానికి చేరుకుని అంకయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎం.వెంకటసుబ్బయ్య, బాబునాయుడు, సురేష్, చింతపట్ల భాస్కర్‌నాయుడు, వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

## అభయవెంకటేశ్వరుని దర్శించుకున్న భక్తులు

కిట కిట లాడిన ఆలయం:సేవా కార్యక్రమాలు



**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం గ్రామంలో వెలసిన అభయవెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. టిటిడి సారధ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.తొండమాన్ చక్రవర్తిచే నిర్మించిన ఆలయాన్ని ఇటీవల టిటిడి అభివృద్ధి చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 'వైకుంఠ ద్వారాలను' ఏర్పాటు చేసారు.తిరుమలేశుని దర్శనానికి భక్తులు ఇబ్బంది పడుతున్న సమయంలో శ్రీకాళహస్తి పట్టణం మరియు చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన జనం స్వామి దర్శనానికి వచ్చారు. సుమారు పదివేలకు మందికి పైగా దర్శనం చేసుకున్నట్లు వివరించారు. కాగా గ్రామానికి చెందిన యువనాయకుడు శేఖర్‌రెడ్డి టిటిడి మినీ క్యాలండర్లను ఉచితంగా పంపిణి చేసారు. ఈ క్యాలండర్లను ఆలయ ఇన్స్‌పెక్టర్ రవికుమార్‌చే ఆవిష్కరింపజేసారు. వైకుంఠ ద్వారాల ద్వారా ప్రవేశించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.కాగా మహిళా భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## శివయ్య సేవలో మాజీ మంత్రి వెల్లంపల్లి



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త** ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయా నికి మాజీ దేవాదాయధర్మాదాయశాఖ మంత్రి వెల్లం పల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్‌మేరకు ఆలయ దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.యస్ రామారావు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మాజీ మంత్రికి ఘనంగా సత్కరించారు.చైర్మెన్ శ్రీనివాసులుతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు సుమతి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, డెప్యూటీ ఇఓ జే. వెంకటసుబ్బయ్య, ఇఇ నూకారత్నం ఆలలయ సూపరింటెండెంట్ నాగభూషణం,నాగభూషణం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో క్రిస్‌మస్ సంబరాలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని యూరోకిడ్స్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో చిన్నారులకు పండగల మీద అవగాహన కల్పించుటకు ప్రయత్నిస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం క్రిస్‌మస్ పండగ సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు క్రిస్‌మస్ ప్రాధాన్యతను వివరిస్తూ చక్కటి పాటలను ఆటలను నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహం నింపారు.ఉపాధ్యాయురాలు మౌసిన్, అఫిరిన్‌లు చిన్నారులను ఉత్సాహ పరచారు. ప్రిన్సిపల్ ఉమాదేవి బాలిశెట్టిపర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.యూరోకిడ్స్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీస్తు సందేశాన్ని సర్వమానవాళి అనుసరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కరస్పాండెంట్ మునిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి నిత్యం భగవంతుడిని ప్రార్ధన చేస్తూ తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ తోటివారిని ప్రేమించడం అలవరచుకుంటే గొప్ప పౌరులుగా వృద్ధి చెందడమే కాకుండా మంచి సమాజానికి పునాదులు వేసిన వారవుతారన్నారు. చిన్నారులందరు శాంతాక్లాజ్ వేషధారణలో అలరించడమే కాకుండా ఏసు క్రీస్తు జననాన్ని చక్కగా తీర్చిదిద్దారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో నిర్వహించబడుతున్న డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో రత్నం పాఠశాల డైరెక్టర్స్ కృష్ణకిషోర్,వాసంతి కిషోర్, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, మేనేజర్ దైవజ్ఞ ఆచారి పాల్గొన్నారు.

## వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కోసమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర



**తొట్టంబేడు/శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త** దేశ ప్రధాని లక్ష్యం వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని అసెంబ్లీ కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. శనివారం తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి, రౌతుసూరమాల, ఏర్పేడు మండలంలోని చింతలపాళెం, అముదూరు శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ, చుక్కలనిడిగల్లు, రూరల్ పరిధిలోని రాచగున్నేరి, కాపుగున్నేరి పంచాయతీల్లో భారతీయ జనతాపార్టీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన పేద ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతోనే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర ముఖ్యఉద్దేశ్యంలో భాగంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రధాని నరేంద్రమోడఈ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిపొందకుండా మిగిలిపోకుడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ , చాగణంశైజల పలువురుపలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ బ్లైండ్ స్టిక్‌కు ఉత్తమ బహుమతి



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పలు ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే వీటిలో వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు అటర్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి కందేరి మేఘనాథ్ ఉపాధ్యాయ విభాగంలో ఆవిష్కరించిన స్మార్ట్ బ్లైంగ్ స్టిక్ రెండో స్థానంలో నిలచి ఉత్తమ బహుమతిని అందుకుంది. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్, జిల్లా సైన్సు అధికారి భాను ప్రసాద్, జిల్లా సైన్సు సమన్వయకర్త ధనంజయులు మేఘనాథ్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించారు. స్మార్ట్ బ్లైండ్ స్టిక్‌లో ఆర్డినో యూఎన్వో కోడింగ్ సౌకర్యం ఉండడంతో దివ్యాంగులు ఇతరుల సాయం లేకుండా నడవడానికి వీలవుతుందన్నారు. కేవలం రూ.వెయ్యి తోనే ఈ స్టిక్‌ను ఉపయోగించుకుని దివ్యాంగులు సులభంగా నడవచ్చన్నారు. మేఘనాథ్ ఆవిష్కరణ రాష్ట్ర స్థాయి సైన్సు పోటీలకు కూడా ఎంపిక కావడం గమనార్హం అన్నారు.

## యువగళం నవశకం వేడుక 5లక్షల మందితో విజయవంతం

-బొజ్జలసుధీర్‌రెడ్డి



**తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త**

యువగళం నవశకం వేడుక బహిరంగసభ 5లక్షలమందికి పైగా జనసందోహంతో విజయవంతం అయ్యిందని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మట్లాడుతూ టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరిబాలకృష్ణలను ఒకే వేదికపై చూసిన తర్వాత వైకాపాలో ఓటమి భయం పట్టుకుందన్నారు. సిఎం జగన్‌రెడ్డి తాడేపల్లి రాజభవనం తలుపులు బద్దలు కొట్టే వరకు సాగే యుద్దం ఇదన్నారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు చెప్పినట్లుగా టిడిపి జనసేన పొత్తు చారిత్రాత్మకమని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఇది ఎంతో అవరమన్నారు. టిడిపి జనసేన పొత్తు రెండు పార్టీల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకోసం అన్నారు. ఉమ్మడి మ్యానిఫేస్టోను త్వరలో తయారు చేస్తామని పవన్‌కళ్యాణ్ మరియు ఇతర టిడిపి నేతల సమక్షంలో అమరావతి, తిరుపతిలో జరిగే రెండు సమావేశాల్లో ఏదో ఒకదాన్ని త్వరలో ప్రకటిస్తారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన అభ్యర్థులను గెలిపించి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

## యువగళం పాదయాత్ర ముగింపు కాదు..

గంగాధర్‌నెల్లూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డా. థామస్

**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**



గంగాధర్‌నెల్లూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డా. థామస్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం నవశకం వేడుకకు 5 లక్షల మందికి పైగా జనసందోహం హాజరై కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టిడిపి ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణలను ఒకే వేదికపై చూసిన తర్వాత వైసిపిలో ఓటమి భయం మొదలైందన్నారు.తేదేపాఅధినేతచంద్రబాబునాయుడుచెప్పినట్లుగా టిడిపి, జనసేన పొత్తు చారిత్రాత్మకం, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఇది చాలా అవసరం అన్నారు. 2024లో ఆంధ్రప్రదేశ్‌లో మార్పు అత్యవసరం, ఆ మార్పు తీసుకురావడానికి టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు.

## గర్భవతులు బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

**బాలాయపల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త** రైతు భరోసా కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు వైఎస్ఆర్ పౌష్టికాహార కిట్లను ఎంపిడిఓ ప్రమీల రాణి, వైసిపి మహిళా ప్రచార విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రావి దేవిక చౌదరి, సిడిపిఓ శంషాద్ బేగం పంపిణీ చేసారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అంగన్‌వాడీ బాలింతలు, గర్భవతులకు తన సొంత నిధులతో చీరలను రావి దేవిక చౌదరి అందజేసారు. సిఎం జగన్ అందిస్తున్న పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా సిడిపిఓ శంషాద్ బేగం కోరారు.పుట్టబోయేబిడ్డలుఆరోగ్యంగాఉండేందుకుగర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు.

## సిఐడి తీరు దారుణం

-తప్పుడు కేసులతో భయపెట్టడం మంచిదికాదు



**తిరుపతి,డిసెంబర్ 23ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టి ప్రజలను, ప్రతిపక్షనేతలను ఇబ్బందిపెట్టిన అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాశామని చెప్పిన టిడిపి యువనేత నారాలోకేశ్ మాటలకు అధికారుల్లో భయం పట్టుకుందని, సిఐడి దీనిపై వ్యవహరిస్తున్న తీరు దారుణమని టిడిపి నాయకులు ఖండించారు. యువగళం ముగింపుసభ విజయవంతం కావడం, జనసేన,టిడిపి నేతలు ఐక్యంగా ప్రజల కష్టాలు తీర్చడానికి ఒక్కటవ్వడం,ఆపై ఎన్నికల్లో పోటీచేయనుండటం చూస్తుంటే అధికారులకు భయం పట్టుకుందని టిడిపి నేతలు ఆర్‌సి మునికృష్ణ, కరాటే చంద్ర, ఊట్లసురేంద్రనాయుడు, శంకర్, ధనంజయ్ వ్యాఖ్యానించారు. వైసిపికి అనుకూలంగా ఉన్న అధికారులకు లోకేశ్ వ్యాఖ్యలతో దిక్కుతోచని పరిస్తితుల్లో ఉన్నారన్నారు. 2024లో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు.

## శాస్త్ర సాంకేతిక ప్రగతికి గణితమే సోపానం

**తిరుపతి క్రీడ, డిసెంబర్ 23, ప్రభాతవార్త** శాస్త్ర సాంకేతిక ప్రగతికి గణితమే సోపానం అని వక్తలు పేర్కొన్నారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఎస్వీయూ గణిత శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఇంజనీరింగ్, అనువర్తిత విజ్ఞా శాస్త్రాల్లో గణితశాస్త్ర పోకడలు అనే అంశం పై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సభను గణితశాస్త్ర విభాగంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రధానాచార్యులు కెటి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిధిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఓఎమ్‌డి హుస్సేన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో గణిత శాస్త్ర శాఖాధిపతి సదస్సు సంచాలకులు ఆచార్య డి. భారతి, యూనివర్సిటీ పూర్వరెక్టార్ ఆచార్య ఎల్. నాగమునిరెడ్డి, గణితశాస్త్రపూర్వ ,ప్రస్తుత ఆచార్యులు డా. సి. జయసుబ్బారెడ్డి, డా. ఎ. సుధాకరయ్య, అకడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చి విద్యార్థులు, పిజి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒక్క ఛాన్స్ ఇవ్వండి .. అభివృద్ధి చేసి చూసి చూపెడతాం.!

టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి



**చంద్రగిరి, డిశంబర్ 23 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజక వర్గ ఎంఎల్ఏ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న పులివర్తి నానిని గెలిపించాలని టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక కొత్తపేటలో శనివారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ, ప్రతీ షాపుకు వెళ్ళి పులివర్తి నానిని గెలిపించాలనీ, సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సింగు సుధ, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌భాషా, కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, కాపువీధి సునీల్, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, రాధమ్మ, సునీత, నాయుడమ్మ, మండలం లోకేష్ రాయల్, ప్రభాకర్ నాయుడు, బ్యాటరీ భాషా, మన్సూర్, సునీల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## "ఆడుదాం ఆంధ్ర" క్రీడలపై ప్రజలకు అవగాహన



**చంద్రగిరి, డిశంబర్ 23 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన "ఆడుదాం ఆంధ్ర" క్రీడలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించినట్లు ఈఓపిఆర్‌డి శశిరేఖ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో టవర్ క్లాక్ వద్ద మానవహారం నిర్మించి ఆడుదాం ఆంధ్ర క్రీడలు విజయవంతం కావాలంటూ నినదించారు. ఎంఈఓ శ్రీవరం లలితకుమారి మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడా స్పూర్తి, చైతన్యం నింపేందుకు పోటీలను తిలకించేందుకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళి రెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంఈఓ 2 భాస్కర్‌బాబు, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పిచ్చినాయుడుపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, రాయలపురం సర్పంచ్ వెంకటయ్య, వైసిపి ప్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బహర్, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, హెచ్‌ఎం విజయ, పిడిలు సక్కుర్ నిరంజన్ రెడ్డి, భానుప్రసాద్, పూర్ణసారచంద్ర, జ్యోతిలక్ష్మి, భారతి, శకుంతల, మదనమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాదికి వరదరాజస్వామి కొత్త ఆలయం సిద్ధం

చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త** వచ్చే వైకుంఠ ఏకాదశి నాటికి ప్రసన్న వరదరాజస్వామి ఆలయం జీర్ణోద్ధారణ పూర్తి చేసి కొత్త ఆలయాన్ని ప్రారంభిస్తామని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. శనివారం ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో భక్తుల దర్శనాలు,ఏర్పాట్లను పర్యవేక్షించారు.అలాగే వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు.ఇక్కడకు వచ్చిన వేలాది మంది భక్తులకు ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునిత,రమాప్రభ, లక్ష్మీ, పసల సుమతి, శ్రీదేవిలు హాజరయ్యారు. కాగా వచ్చిన భక్తులకు ఏర్పాట్లు, సుదర్శనం ను ఎఇఓ లోకేష్‌రెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, కొండూరు నరసింహారాజు, భాస్కర్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు:



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో రద్దీ బాగా పెరిగింది. ఈ నేపధ్యంలో అభయ వెంకటేశ్వరస్వామికి అర్చకుడు కన్నలి సురేష్ ప్రత్యేంగా షోడషాభిషేకాలు నిర్వహించారు.ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు,హరియాదవ్ పర్యవేక్షించగా చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు బోర్డు సభ్యులు కొండూరు సునిత,రమాప్రభ, లక్ష్మీ, పసల సుమతి, శ్రీదేవిలు హాజరయ్యారు.

## నిత్యాన్న ప్రసాదాన్ని రుచి చూసిన ఉపముఖ్యమంత్రి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు ముక్కంటీశుని ముక్కోటి ఏకాదశి సందర్భంగా దర్శించుకోవటానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి పిడికా రాజన్నదొరకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల దర్శనానం తరం ఓ సామాన్యభక్తుని వలె ఇక్కడ భక్తులకు అందిస్తున్న నిత్యాన్న ప్రసాదాన్ని రుచి చూడాలని కోరారు.వెంటనే చైర్మెన్ నిత్యాన్న ప్రసాదంలో భక్తులతో పాటు ఉపముఖ్యమంత్రికి భోజనం వసతి కల్పించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో గీతా పారాయణం



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 23 ప్రభాతవార్త** ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం కాకినాడకు చెందిన శ్రీమద్భగవద్గీత ప్రచార సంస్థ చే 97 మందితో సంపూర్ణ గీతా పారాయణంను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు.కాకినాడకు చెందిన పి.సుధామాధురి సారధ్యంలో సుమారు 100 మంది బృందంతో నిర్వహించటం అభినందనీయమని చైర్మెన్ ప్రశంసించారు.

## మెగా డిఎస్సీని గాలికి వదిలేశారు..రైతుల గోడు పట్టించుకోరు

**తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త**



మెగా డిఎస్సీని గాలికి వదిలేశారని, మిచెంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతుల గోడును పట్టించుకునే నాధుడే లేడని ఇదేనా వైకాపా ప్రభుత్వంలో ప్రజల పరిస్థితి అని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట అన్నారు. జనసేన విజయయాత్రలోభాగంగా 'ఏపి నీడ్స్ పవన్‌కళ్యాణ్' 23వ రోజు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం చియ్యవరం పంచాయతీలోని చియ్యవరం, చియ్యవరం ఎస్‌సి కాలనీ, ఎస్‌టి కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజలకు వైకాపా ప్రభుత్వంమరియు స్థానిక ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి చేస్తున్న అవినీతి, అక్రమాలను దోపిడీలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పేటచంద్రశేఖర్, మండల అధ్యక్షుడు దండిరాఘవయ్య, ఐటి కోఆర్డినేటర్ కావలిశివకుమార్, కవిత, శారద,రాజ్యలక్ష్మి, చిరంజీవి, సురేష్, మునెయ్య, రాజేష్, మాతయ్య, జయ, దినేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నాయకుడిని పరామర్శ



**తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త** మండలంలోని పొయ్య గ్రామంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి నాయకులు రాజగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేసుకున్న విషయం తెలుసుకుని వారిని పరామర్శించి తప్పకుండా ఆదుకుంటామని మండల వైకాపా ఇన్‌ఛార్జి, ఎంఎల్ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి అన్నారు. శనివారం పొయ్య గ్రామంలో రాజగోపాల్‌ను పరామ ర్శించి తామున్నామంటూ భరోసాను ఇచ్చారు. పరామర్శించిన వారిలో సీనియర్‌నాయకులు ఉన్నంవా సుదేవనాయుడు,సర్పంచ్‌సక్కుబాయమ్మ, మణి, మోహన్, రాజబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడుగా నరేంద్ర

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త** కేంద్రమాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ ఆదేశాల్లో భాగంగా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ శ్రీకాళహస్తి, సత్యవేడు సర్వేపల్లి నియోజకవర్గంలో పలువురు నూతన కమిటీలను ప్రకటించింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా జి.నరేంద్రను ప్రకటించింది. ఈ మేరకు అధిష్టానం శనివారం ఉత్తర్వులు చేసింది. ఈసందర్భంగా పలువురు నరేంద్రను అభినందించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీని బలపరచేందుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## నారాయణవనంలో ఆడుద్దాం ఆంధ్రపై విద్యార్థుల ర్యాలీ



**నారాయణవనం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** ఆడుద్దాం ఆంధ్ర కార్యక్రమంపై నారాయణవనం, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు శనివారం ఉదయం నారాయణవనంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, వైస్‌ఎంపిపి శివశంకర్, ఎంపిటిసి రాధ మోహన్, ఎంఇఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్లు సులోచన, శశికళ, ఉపాధ్యాయులు అందరు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థులకు 'కేరీర్ అవేర్ అవేర్ నెస్'

-విద్యార్థులు అకడమిక్‌తో పాటు ఉద్యోగ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి

-కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్



**తిరుపతిరూరల్, డిసెంబర్23 ప్రభాతవార్త:** డిగ్రీ చదువున్న విద్యార్థులు అకడమిక్ చదువుతో పాటు ఉద్యోగ నైపుణ్యాలపై దృష్టి సారిస్తే సులభంగా ఉద్యోగాలు సాధించుకోవచ్చునని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ సూచించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కేరీర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీ చదివే విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షలపై కూడా దృష్టి పెడితే అనుకున్న ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. మీ కేరీర్‌లో మీరు స్థిరపడాలన్నా...కంపెనీలలో మీరు ఉద్యోగ సాధన చేయాలన్నా ముఖ్యంగా మీకు కావాల్సింది తార్కిక ఆలోచనతో కూడిన పరిజ్ఞానం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు అలవరుచుకోవాలంటే ఉద్యోగ నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. రేపు మీ జీవితం హార్డ్‌గా కాకుండా స్మార్ట్‌గా ఉండాలంటే ఈ రోజు మీ స్మార్ట్ ఫోన్‌ని వదిలేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో పైకి రావాలంటే లీడర్ షిప్, సమయ స్ఫూర్తి, కమ్యూనికేషన్స్ ఉండాలని, ప్రతి మనిషిలో ఏదోఒక నైపుణ్యం దాగి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ, మోహన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పుదిపట్లలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

**తిరుపతిరూరల్, డిసెంబర్23 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ పుదిపట్ల గ్రామ పంచాయతీలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పుదిపట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ బడి సుధా యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామ భజనమందిరములో వైకుంఠ ద్వారా దర్శన ఏర్పాట్లు చేసారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీరామ భజన మందిరములో పూలు, పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి వేకుజామున 4గంటలను సుప్రభాత సేవతో మేల్కొలిపి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఉదయం నుండి భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, నాగార్జున, రవీంద్ర, మునికృష్ణతదితరులు పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయుటకే 'ఆడుదాం-ఆంధ్ర'



**తిరుపతిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** గ్రామీణ క్రీడాకారులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తిరుపతిరూరల్ ఎంపిడిఓ కనపర్తి రమేష్‌బాబు తెలిపారు. శనివారం తిరుపతిరూరల్ ఎంఇఓ శంకరయ్య, తిరుచానూరు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు ఆధ్వర్యంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌బాబు మాట్లాడుతూ డిసెంబర్ 26 నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో క్రీడలు వివిధ దశలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26 నుండి జనవరి 9వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో 24 నుంచి 30వరకు, నియోజకవర్గ స్థాయిలో 30 నుంచి ఫిబ్రవరి 2వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3నుండి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయని తెలిపారు.

## క్రీడల్లో విజయపురం విద్యార్థుల ప్రతిభ

**విజయపురం, డిసెంబరు 23 ప్రభాతవార్త :**



నగరి నియోజకవర్గ స్థాయిలో నగరి మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నాగరాజుకుప్పంలో జరిగిన జోనల్ పోటీల్లో విజయపురం మండలం శ్రీహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన సతీష్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. బాలికల విభాగంలో యమున హైజంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం సాధించింది. అలాగే యోగ పోటీల్లో బాలికల విభాగంలో జీవిత, బాలుర విభాగంలో మదన్‌మోహన్ రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ శనివారం విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను బహుకరించారు.వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మీపతి పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో గాలి భానుప్రకాష్



**నగరి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** నగరి పట్టణం నాగలాపురం రోడ్డుసూర్య డిగ్రీ కాలేజీ సమీపం క్రీస్తు సంఘం చర్చిలో 18వ క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్‌కు ముఖ్య అతిథిగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. చర్చి ఫాదర్‌లకు నగరి టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్‌శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, టీఎన్‌టీయూసీ సెక్రటరీ బాలాజీ, అల్లిముత్తు, ఖాదర్ బాయ్, లోకేంద్రబాబు, పి.వెంకటేష్, అశోక్, రజనికాంత్,రవినాయుడు,రాజేంద్ర,సంపత్, రమేష్, మాణిక్యం, వాసు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆటల జాతర ఆడుదాం ఆంధ్ర - మున్సిపల్ చైర్మన్



**నగరి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ఆటల జాతర లాంటిందని మున్సిపల్ చైర్మన్ నీలమేఘం అన్నారు. శనివారం ఓం శక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విశిష్టతను తెలియజేసే విధంగా మున్సిపల్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం, మెప్మా అధికారి సునీత, వైస్ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు ఎంపీటీసీ లు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్‌సభ్యులు, సచివాలయసిబ్బంది, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

భక్తులతో కిక్కిరిసిన కరియమాణిక్యస్వామి ఆలయం

**నగరి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మున్సిపల్, మండల ప్రాంతాల్లోనిఇ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటల నుంచే భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. బుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని ప్రయాగ మాధవస్వామిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. పట్టణ పరిధిలోని ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని చేసిన అలంకరణలు భక్తులను అబ్బురపరచారు. మూల విరాట్ ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వైకుంఠ ద్వారం ఏర్పాటు చేసి అందులో ఉంచిన గరుడ వాహన వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని భక్తులు దర్శించుకున్నారు.

## వెంకటరమణా గోవిందా...గోవిందా....

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



**పుత్తూరురూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మున్సిపల్, మండల ప్రాంతాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలోని కామాక్షిసమేత సదాశివస్వామికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో శంఖు, చక్రం, శూలం, వెంకటేశ్వరుని చిత్రపటం, లింగాకార శివుడు,స్వస్తిక్,ఓంఆకారాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించడం భక్తులను అబ్బురపరచింది. ఈ ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**న గీతామందిరంలో...** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న విష్ణు మందిరంలో గీతా జయంతి, ధనుర్మాసం సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి అభిషేకాలు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో ఉదయం అఖండ గీతా పారాయణం, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా బాబా ఉత్సవ విగ్రహం, మూలస్థానం విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వాదశి దర్శనభాగ్యం కల్పిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు.

## పుత్తూరులో అయోధ్య రాముని అక్షింతలు ఊరేగింపు

**పుత్తూరురూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** అయోధ్య రామ జన్మభూమి నుంచి అందించబడిన శ్రీరామచంద్రుని అభిషేకించిన అక్షింతల వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ నాయకులు బాలకృష్ణారెడ్డి, మునిరత్నం, గోవిందరాజులు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, బాబు, మోహన్, మహేష్, రమేష్, ఆర్ముగం,సంతోష్ పాల్గొన్నారు.

